

అప్పుడు అయ్యాఎస్!

జనవరి 31: తిరుపతి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా ఆ వెంటనే అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్లి పుష్ప గుచ్ఛం అందజేసి విధేయతను ప్రకటించుకున్నారు.

జగన్‌రెడ్డి పాలన తీరుకూ, చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనకూ ఉన్న తేడాను ఈ ఫొటోలు చాటిచెబుతున్నాయి.ఎంతస్థాయి అధికారులైనా ఎమ్మెల్యేలకు అణగిమణిగి ఉండాల్సి వచ్చేది. ఐఏఎస్, ఐపీఎస్ అధికార హోదాలు నాయకుల ముందు తలవంచాల్సి వచ్చేది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. అధికారులకు తగిన మర్యాద ఇవ్వాలని సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెబుతూవచ్చారు. దీంతో అధికారులే కాదు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలూ మారారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇప్పుడు ఐఏఎస్!

జూలై 4: తిరుపతి కలెక్టర్‌గా ఎస్. వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలెక్టరేట్‌కు వెళ్లి, కొత్త కలెక్టర్‌కు శాలువాకప్పి శ్రీవారి జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.చంద్రగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు నాని, ఆదిమూలం కూడా కలెక్టరేట్‌లోనే కొత్త కలెక్టర్‌ను కలిశారు.



ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై దృష్టిపెడతా

కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి/తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అధికారుల, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రజలకందేలా కృషి చేస్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. తిరుపతి కలెక్టర్‌గా గురువారం ఉదయం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు.పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.డెంగ్యూ జ్వరాల నివారణ చర్యలపై దృష్టి పెడతామన్నారు. అంతకుముందు ఆయన తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.కలెక్టర్‌గా శ్రీవారి సన్నిధిలో బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజలకు దారివ్వు పెద్దిరెడ్డీ..!

పబ్లిక్ రోడ్డుకు పెట్టుకున్న గేటు తొలగింపునకు జనసేన యత్నం - అడ్డుకున్న పోలీసులపై ఆగ్రహం

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసుకున్న గేట్లు తొలగించడానికి జనసేన చేసిన ప్రయత్నం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును స్థానికులకు అందుబాటులోకి లేకుండా సొంత ప్రయోజనాల కోసం పెద్దిరెడ్డి వాడుకుంటున్నారంటూ మీడియాలో కథనాలు రావడంతో కిరణ్ రాయల్ నేతృత్వంలో జనసేన పార్టీ శ్రేణులు గురువారం పెద్దిరెడ్డి ఇంటి ముందు ధర్నాకు దిగారు. గేటును తొలగించాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ తామే తొలగించడానికి పూనుకున్నారు.జనసేన ఆందోళన సమాచారం ముందే తెలుసుకున్న పోలీసులు కిరణ్ రాయల్ తదితరులను పెద్దిరెడ్డి ఇంటి సమీపంలోని బండారు ఆంజనేయ



గేటు తొలగించాలని పోలీసులతో జనసేన శ్రేణుల వాగ్వాదం



పెద్దిరెడ్డి ఇంటి ముందు రహదారికి అడ్డుగా గేటు

స్వామి ఆలయం వద్ద బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ ఘటనాస్థలానికి రావాలని డిమాండు చేశారు. గేట్లు తెరిపించి అందుబాటులోకి తీసుకురావాలని నినదించారు. దాదాపు గంటపాటు నిరసన చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు రాకపోవడంతో తామే గేట్లు తొలగిస్తామని జనసేన నేతలు కిరణ్ రాయల్, సుభాషిణి తదితరులు బారికేడ్లు తోసుకుని ముందుకు వెళ్లబోయారు. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు జనసైనికులను అడ్డుకుని పోలీసు వ్యానులోకి ఎక్కించేప్రయత్నం చేశారు. ఈక్రమంలో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గేట్లు తొలగించి రెండు కాలనీల వాసులకు దారి కల్పిస్తామని తాము హామీ ఇచ్చామని, అందులో భాగంగా కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు కిరణ్ రాయల్ చెప్పారు. అయినా పట్టించుకోకపోవడంతో తమ నేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ప్రజలకిచ్చిన మాట కోసం పెద్దిరెడ్డి కోటకు పెట్టుకున్న గేట్లను తొలగించేందుకు వస్తే పోలీసులు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నట్టు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వం మారినా పోలీసులు మారరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంతలో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గేట్లు తొలగించడానికి రెండు రోజులు సమయం కోరడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్, మనోజ్, సాయి, కుమార్, శేషాద్రి పాల్గొన్నారు.

'అసలిది అన్నమేనా, ఎలా తినాలి. కమీషన్లు తీసుకుని చెత్తభోజనం పెడుతున్నారు. మీ ఇంట్లో కూడా ఇలాంటి అన్నమే తింటారా, బయట తినలేక కాదు స్వామి ప్రసాదమని వచ్చాం, ఆకులో పెట్టిన అన్నం ఎవరు తినలేదు. కోట్ల ఆదాయం స్వామికి వస్తోంది. ఇలాంటి అన్నం పెడతారా. టీటీడీకి ఏం తక్కువ. ఆకలితోనే లేచేశాం. చాలా అన్నం వృధా అయ్యింది'

'అన్నప్రసాదం ముద్దగా ఉంటోంది. అసలు రుచి, నాణ్యత కనిపించడం లేదు'

ఇవన్నీ గత ప్రభుత్వంలో టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవారి అన్నప్రసాద వితరణపై భక్తుల నుంచి వచ్చిన విమర్శలు.



శ్రీవారి అన్నప్రసాదాల

రుచి మారేనా?

గతంలో వచ్చిన విమర్శలపై టీటీడీ ఈవో సమీక్షలు

ఆహార పదార్థాలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశాలు

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రూ.5 వేలకోట్ల బడ్జెట్ కలిగిన టీటీడీ భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలను వడ్డించడం లేదంటూ భక్తుల నుంచి తరచూ విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. స్వామి దర్శనానికి వచ్చే ధనిక భక్తుల నుంచి సామాన్య భక్తుల వరకూ కనీసం ఒక్కపూటైనా స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరిద్దామని వచ్చి తీవ్ర అసంతృప్తితో తిరిగి వెళ్లిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి.1985నుంచి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సూచనలతో టీటీడీ భక్తులకు అన్నప్రసాదాలను అందజేస్తోంది. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలో,బయటి క్యూలైన్లలో, పీఏసీ-4, పీఏసీ-2, వివిధ ప్రాంతాల్లోని ఫుడ్‌కౌంటర్లలో, వృద్ధులు, దివ్యాంగుల క్యూలైన్‌లో, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూకాంప్లెక్స్‌లో, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, శ్రీనివాసం,విష్ణునివాసం యాత్రికుల సముదాయాల్లో, రుయా, స్విమ్స్, ప్రసూతి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రుల్లో, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో రోజూ దాదాపు లక్షన్నర మందికి అన్నప్రసాదాలను అందజేస్తోంది. ప్రధానంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా భారీ భవనంలో ఒకేసారి 16 వేలమంది కూర్చుని భోజనం చేసేలా వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని టీటీడీ నడుపుతోంది. ఈ భవనంలో రోజుకు దాదాపు 40 నుంచి 45 వేల మంది భోంచేస్తున్నారు. అయితే ఇటీవల ఈ భవనంలో వడ్డిస్తున్న అన్నప్రసాదాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అన్నం గట్టిగా ఉంటోందని పలుమార్లు విమర్శలొచ్చాయి. ప్రతినెలా నిర్వహించే డయల్ యువర్ ఈవో కార్యక్రమంలోనూ పలువురు భక్తులు అన్నప్రసాదం నాణ్యత బాలేదంటూ నేరుగా ఈవోకే ఫిర్యాదు చేసిన ఘటనలున్నాయి. మరికొంతమంది అన్నం గట్టిగా ఉంటోందని, తినడానికి ఏమాత్రం రుచిగా లేదని చెబుతూ 'నాశనమైపోతారు' వంటి శాపనార్థాలు పెట్టారు. పలువురు భక్తులు తమ ఆవేదనను వీడియోలు తీసి సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేసిన సందర్భాలున్నాయి.కొంతమంది దేవుడి ప్రసాదం కావడంతో బాగాలేదని బయటకు చెప్పలేక రెండు ముద్దలు తిని చేయి కడిగేస్తున్నారు.

నాణ్యత తగ్గిన విషయాన్ని ఒప్పుకున్న టీటీడీ

అన్నప్రసాద విభాగంలో గత రెండేళ్లుగా టెండర్ ద్వారా బియ్యం కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత తగ్గడాన్ని తాము కూడా గుర్తించామంటూ టీటీడీ కూడా ఒప్పుకుంది. భక్తుల నుంచి తరచూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇకపై రైస్ మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, నిపుణులైన సిబ్బందిని తీసుకుని మరింత నాణ్యంగా అన్నప్రసాదాలను తయారుచేసి అందజేస్తామని చాలా సందర్భాల్లో చెప్పుకొచ్చింది. అయితే అన్నప్రసాదాల తయారీ కోసం టీటీడీ కొనుగోలు చేసే ముడిసరుకుల క్వాలిటీని పరీక్షించేందుకు ల్యాబ్ కూడా అందుబాటులో ఉన్నప్పటికీ అన్నప్రసాదాల నాణ్యత తగ్గడం పలు అనుమానాలకు దారితీస్తోంది. కొంతమంది అధికారులు కమీషన్ల కోసం కక్కుర్తిపడడంవల్లే అన్నప్రసాదాల్లో నాణ్యత, రుచి తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.అన్నప్రసాదం ట్రస్టుకు అందుతున్న విరాళాల ద్వారా వచ్చే వడ్డీ ద్వారానే దాదాపుగా అన్నప్రసాదాల వితరణ జరుగుతున్న క్రమంలో ఇలాంటి విమర్శలను ఎదుర్కొవడం శ్రేయస్కరం కాదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. దేవుడి ప్రసాదంగా భావించి భక్తులు స్వీకరించే అన్నప్రసాదాల్లో నాణ్యత, రుచి విషయంలో టీటీడీ మరింత శ్రద్ధ చూపించాల్సిన అవసరముందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

నాణ్యత పెంపుపై ఈవో కసరత్తు

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతలు స్వీకరించాక తొలుత అన్నప్రసాదాలపై వస్తున్న విమర్శలపైనే ప్రధానంగా దృష్టిసారించారు.నాణ్యత ఎందుకు తగ్గింది, ఎక్కడ లోపాలున్నాయనే అంశాలపై తరచూ సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్నప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న బియ్యాన్ని, సరుకులను స్వయంగా పరిశీలించారు. భక్తులకు వడ్డిస్తున్న అన్నప్రసాదాలను నేరుగా రుచి చూసి గుర్తించిన లోపాలపై అధికారులతో మాట్లాడుతున్నారు.ఇకపై భక్తులకు నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించాలని అభిప్రాయపడ్డారు. అలాగే ముడిసరుకుల కొనుగోళ్లపై దృష్టి సారించారు. నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసేలా అధికారులతో సమీక్షలు జరుపుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో గతంలోలాగే రుచికరమైన అన్నప్రసాదాలు అందుతాయని భక్తులు ఆశపడుతున్నారు.

బస్సు నడుపుతుండగా

డ్రైవరుకు గుండెపోటు

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- కండక్టర్ అప్రమత్తతతో ప్రయాణికుడికి తప్పిన ముప్పు

కల్లూరు, జూలై 4: రాత్రి 9 గంటలు.. కల్లూరుకు ఆర్టీసీ బస్సు వస్తోంది. అదే సమయంలో బస్ డ్రైవరుకు గుండె నొప్పి వచ్చింది. కొద్ది క్షణాలకే తీవ్రమైంది. అప్పటికే చేతిలో స్టీరింగ్ అదుపు తప్పింది. బస్సు రోడ్డు పక్క గుంతలోకి ఒరిగి పోయింది. కండక్టర్ వెంటనే అప్రమత్తమై బస్‌ను నియంత్రించారు. ఆస్పత్రికి తరలించినా డ్రైవరు ప్రాణాలు దక్కలేదు. తిరుపతి నుంచి కొత్తపేట మీదుగా చిత్తూరు జిల్లా కల్లూరుకు బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. కల్లూరు నైట్ హాల్ట్ కావడంతో బస్సులో ఒక ప్రయాణికుడు మాత్రమే ఉన్నారు. పులిచెర్ల మండలం కొక్కువారిపల్లి సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ రాఘవయ్య(56)కు గుండెపోటు వచ్చింది. బస్సును నియంత్రించడం సాధ్యం కాలేదు. బస్సు రోడ్డు పక్కనున్న గుంతలోకి ఒరిగిపోయింది. కండక్టర్ మణి పరిస్థితి గుర్తించారు. హుటాహుటిన ప్రయాణికుడితో కలసి డ్రైవర్‌ను కిందకు దింపారు. అటుగా వెళుతున్న కారును ఆపి పులిచెర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రాఘవయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు.రాఘవయ్య మృతదేహాన్ని స్వగ్రామం సోమల మండలం పొదలగుంటపల్లికి తరలించారు. ప్రజా రవాణా సంస్థ జోనల్ కార్యనిర్వహణ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ రెడ్డి, పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య, సిబ్బంది సందర్శించి రాఘవయ్యకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.



రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు, రాఘవయ్య (ఫైల్ ఫొటో)

రాజముద్రతో 49,535 కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు

- 'భూహక్కు' పత్రాల స్థానంలో

త్వరలోనే రైతులకు అందజేసేందుకు అధికారుల కసరత్తు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4 : వందేళ్ల తర్వాత భూములు రీసర్వే చేస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. రైతులకు కనీస సమాచారం లేకుండానే హద్దులు పాతారు. హడావుడిగా సర్వే చేసి పల్లెల్లో భూపంచాయితీలు పెంచారు. కోట్లాది రూపాయలు వెచ్చించి జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం చేతిలో పెట్టారు. 'భూహక్కు' పత్రమంటూ జగన్ ఫొటోతో ఉన్న పాసుపుస్తకాలు ఇవ్వడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో తాము అధికారంలోకి రాగానే రాజముద్రతో కూడిన పుస్తకాలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మాదిరే పాసుపుస్తకాలపై ప్రభుత్వ రాజముద్రను మాత్రమే ఉంచాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో భూపరిపాలనశాఖ ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్, సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ జిల్లా అధికారులతో సమీక్షించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం భూహక్కు పత్రాలు ఎన్ని పంపిణీ చేసింది. ఇంకా ఎన్ని ఉన్నాయి.. అనే వివరాలు ఆరా తీశారు. ఇప్పటి వరకు జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు రెండు విడతల్లో 34,120, మూడో విడతలో 15,415 కలిపి మొత్తం 49,535 పంపిణీ చేసినట్లు సీసీఎల్‌ఏ అధికారుల దృష్టికి జిల్లా యంత్రాంగం తీసుకెళ్లింది. వీటన్నింటినీ వెనక్కి తీసుకుని, రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను రైతులకు త్వరలోనే అందజేయనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. కాగా జిల్లావ్యాప్తంగా 34 మండలాల్లో మూడు విడతల్లో 320 గ్రామాల్లో భూసర్వే పూర్తయింది. పొలాల సరిహద్దుల్లో 2.50లక్షల రాళ్లను నాటినట్లు జిల్లా సర్వేశాఖ తెలిపింది. అయితే ఆ రాళ్లపైనా జగన్ బొమ్మతో కూడిన పబ్లిసిటీ తగ్గలేదు. దీనిపైనా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపైనా కూటమి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రానుంది.

24 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతి

తిరుపతి(విద్య), జూలై 4: రాష్ట్రంలో పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికిగాను ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గురువారం ఉత్తర్వులు వెలువరించింది. ఇందులో చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,080 ఇన్‌టేక్ అడ్మిషన్లకు, 21 ప్రైవేట్ కళాశాలల్లో 18,900 ఇన్‌టేక్ అడ్మిషన్లకు, మొత్తంగా 24 కళాశాలల్లో 19,980 ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే తిరుపతి జిల్లా పుత్తూరు ఇప్పతంగలి గ్రామం ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 360 ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతులు ఇచ్చింది.


నూతన కలెక్టర్ వెంకటేశ్వర్‌కి అభినందనలు తెలియజేస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ నాయకులు

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



రామచంద్రాపురం, జూలై 4: నెత్తకుప్పం జాతరసందర్భంగా విద్యుదాఘాతానికి గురై టీడీపీ కార్యకర్త గోపి మృతి చెందిన విషయం తెలిసిందే. టీడీపీ నాయకులు గురువారం ఆయన మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కుటుంబీలను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరినాయుడు, నాయకులు మురళీనాయుడు, జయచంద్రనాయుడు, ధనశేఖర్, చిన్నస్వామిరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

10 నుంచి కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు


సుంగధ ద్రవ్యాలు తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

చంద్రగిరి, జూలై 4: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా జరిగింది. ఆలయంలో ఈనెల 10 నుంచి 12వ తేదీవరకు సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి.. తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం చేశారు. ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

13న పార్వేట ఉత్సవం

సాక్షాత్కార వైభవోత్సవాల మరుసటి రోజైన ఈనెల 13వ తేదీన పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామవారికి ప్రత్యేక ఆస్థానం ఉంటుంది.

ఆంగ్లంపై భయాన్ని తొలగించాలి : ఎంఈవో

పాకాల, జూలై 4: ప్రాథమిక స్థాయిలోనే పిల్లలకు ఆంగ్లం పట్ల భయాన్ని తొలగించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో బాబ్జి సూచించారు. గురువారం పచ్చిపాలపల్లె, అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు శేషాద్రి, జ్యోతి, ఉపాధ్యాయుడు కేశవరావ్, సీఆర్పీ శ్రీనివాసులు, అంగన్వాడీ కార్యకర్త సరళ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని నెల్లూరువాసి దుర్మరణం


సురేంద్ర మృతదేహం

చంద్రగిరి, జూలై 4: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నెల్లూరువాసి దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన సురేంద్ర(40).. చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లె వద్ద ఉన్న నారాయణ కళాశాలలో మెస్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి నాగయ్యగారిపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై నారాయణ కళాశాలకు బయల్దేరాడు. మార్గమధ్యంలో పీలేరు, తిరుపతి జాతీయ రహదారిలో నాగయ్యగారిపల్లె వద్ద మలుపులో రాత్రి 10.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి కోటలో లైటింగ్ షో ప్రారంభించేదెప్పుడు?



చంద్రగిరి, జూలై 4: మరమ్మతులు పూర్తయినా చంద్రగిరి కోటలో లైటింగ్ షో మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందు మరమ్మతులు పూర్తవడంతో మార్చి నెలలో పురావస్తు శాఖ, ఏపీ టూరిజం అధికారులు, లైటింగ్ షో నిర్వాహకులు లక్స్ అండ్ డిజబుల్ సంస్థ ఇంజనీర్లు కోటను సందర్శించి.. లైటింగ్ షోను తిలకించారు. త్వరలోనే లైటింగ్ షోను పునఃప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఆలస్యమైంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లైటింగ్ షోను త్వరగా ప్రారంభించాలని సందర్శకులు కోరుతున్నారు.

బైక్‌ని ఢీకొన్న ఆటో: ఇద్దరికి గాయాలు


సంఘటనా స్థలంలో వాహనాలు - గాయపడ్డ అరుణకుమార్, ఉమ

రామచంద్రాపురం, జూలై 4: తిరుపతి-పచ్చికాపల్లం ప్రధానరహదారి వేమారెడ్డి నగర్ సమీపంలో గురువారం సాయంత్రం బైక్‌ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. ఆర్సీపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి విద్యానగర్‌కు చెందిన అరుణకుమార్, రిక్షా కాలనీకి చెందిన ఉమ ఆర్సీపురం మండలంలో భవన కార్మిక పనులు ముగించుకుని బైక్‌కి స్వస్థలానికి బయల్దేరారు. మద్యం తాగిన నితిన్ తిరుపతి నుంచి ఆటోను వేగంగా నడుపుతూ వేమారెడ్డినగర్ వద్ద బైక్‌ని ఢీకొట్టాడు. అరుణకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఉమ స్వల్పంగా గాయపడింది. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

దేశపురోభివృద్ధిలో యువత పాత్ర కీలకం

వివేకానంద రాక్ మెమోరియల్ జనరల్ సెక్రటరీ భానుదాస్ దాకరస్


ప్రసంగిస్తున్న భానుదాస్ దాకరస్

తిరుపతి రూరల్, జూలై 4: దేశపురోభివృద్ధిలో యువత పాత్ర కీలకమని వివేకానంద రాక్ మెమోరియల్ కన్నియకుమారి కేంద్ర జనరల్ సెక్రటరీ భానుదాస్ దాకరస్ అన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ఎన్ఎస్ఎస్‌యూనిట్-2, ఆసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విశ్వగురు భారత నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర అనే అంశంపై సమావేశం నిర్వహించారు. వివేకాకేంద్రం తిరుపతి డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్, అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంతశుక్లా, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, ఎన్ఎస్ఎస్‌సెల్ కోఆర్డినేటర్ చందూలాల్, ప్రోగ్రామ్ ఆఫీసర్ కనపాల కుమార్, మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించరా?


ఆర్టీవో కార్యాలయం నుంచి బీటీఆర్ కాలనీకి వెళ్లే ప్రధానమార్గంలో.. - వెంకటేశ్వరకాలనీలో..

మంగళం, జూలై 4: మంగళం పరిధిలోని ఆర్టీవో కార్యాలయం నుంచి బీటీఆర్ కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో, వెంకటేశ్వరకాలనీలో చెత్త పేరుకుపోయింది. దీనివల్ల దుర్గంధం ఎక్కువై ఈ మార్గంలో వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే ఈ చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించను

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తినానీ, పక్కనే అధికారులు

తిరుపతి రూరల్, జూలై 4: ప్రజలను ఎవరు ఇబ్బంది పెడితే సహించేది లేదని చంద్రగిరి ఎమ్మెల్యే నాని హెచ్చరించారు. రాజకీయనేతలు, అధికారవర్గాలు అందరూ ప్రజల కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రవర్తించిన తీరును అధికారులు మార్చుకోవాలని సూచించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తగిన గౌరవం ఇచ్చి, వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఉద్యోగులు కూడా ఎవరివల్ల అయినా ఇబ్బంది పడుతుంటే తనదృష్టికి తేవాలన్నారు. మండలంలో గతప్రభుత్వంలో చేపట్టిన ఉపాధిపనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవడానికి అధికారులు సహకరించాలని తెలిపారు. అంతకముందు ఎమ్మెల్యేని ఎంపీపీ యశోద మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తిరుచానూరులో పట్టపగలే దొంగలు పడ్డారు

కాంట్రాక్టు ఉద్యోగి ఇంట్లో చోరీ - 18 సవర్ల బంగారు నగలు, అర కిలో వెండి వస్తువులు, రూ.2.50లక్షల అపహరణ


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్నవస్తువులు

తిరుచానూరు, జూలై 4: తిరుచానూరులో పట్టపగలే దొంగలు పడ్డారు. పంచాయతీలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి మునేంద్ర ఇంట్లో 18 సవర్ల బంగారు నగలు, అరకిలో వెండి వస్తువులు, రూ.2.50 లక్షలు, చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. తిరుచానూరు కాలవగడ్డ వీధిలో మునేంద్ర కుటుంబం నివాసం ఉంటోంది. గురువారం మధ్యాహ్నం విధుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి, తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపు గడియ విరగ్గొట్టి లోపలకి వెళ్లారు. బీరువాలోని 18 సవర్ల బంగారు నగలు, అర కిలో వెండి వస్తువులు, రూ.2.50లక్షలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు పొలం వద్ద నుంచి మునేంద్ర తల్లిదండ్రులు ఇంటికి రాగా తలుపులు తెరచి ఉన్నాయి. లోపల వస్తువులన్నీ చిందరవందగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీం సిబ్బంది వచ్చి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తిరుచానూరు పరిసరాల్లో రాత్రి గస్తీ సరిగా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామం నడిబొడ్డులోనే పట్టపగలు దొంగలు పడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని అంటున్నారు.

అల్లూరికి ఘన నివాళి


ఎస్పీ క్యాంపు కార్యాలయంలో.. - కార్మిక శాఖ కార్యాలయంలో..

తిరుపతి(క్రీడలు/ ఆటోనగర్/ నేరవిభాగం/ కల్చరల్/ మంగళం), జూలై 4: అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో జిల్లా క్రీడాకాధికారి సయ్యద్ సాహెబ్, కోచ్‌లు ఆది, లక్ష్మి, హిమబిందు, గోపి తదితరులు పాల్గొన్నారు. ● కార్మిక శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప కమిషనర్ బాలూ నాయక్, సహాయ కమిషనరు, సిబ్బంది పాల్గొన్నారు. ● తారకరామ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.హరీష్, నాయకులు నవీన్ కుమార్, మహేష్ అజయ్, అమీనలతో పాటు వాకర్లు పాల్గొన్నారు. ● ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. ● రాములవారి గుడి దక్షిణమాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి సభ్యుడు చిత్రపు హనుమంతరావు, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి ఆర్కే శేషగిరిరావు, కామేశ్వరరావు, విశ్వనాథ్, శాంబోలు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ● ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్, సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ, ఎఫ్ఆర్వోలు మురళీకృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అల్లూరి జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, ఎన్ఎస్ఎస్ పీవో మునిరాజ, అధ్యాపకులు పాల్గొన్నారు.


పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


చంద్రగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

చంద్రగిరి: పాతపేట రాములవారి ఆలయం సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో లలితకుమారి, హెచ్ఎం రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో అల్లూరి విగ్రహం పెట్టండి

కమిషనర్‌కి కార్పొరేటర్ల వినతి


కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం పెట్టాలని నగరపాలక కమిషనర్ అదితిసింగ్‌కి గురువారం కార్పొరేటర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. నగరంలో అనేక విగ్రహాలు ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి విగ్రహం ఏర్పాటు విషయాన్ని వచ్చే కౌన్సిల్ సమావేశంలోని అజెండాలో పెట్టాలని కోరారు. కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, ఎస్కే బాబు, వరిగుంట్ల నారాయణ, నరసింహ, కోటూరి ఆంజనేయులు, అనిల్ పాల్గొన్నారు. కాగా, అల్లూరి జయంతి సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ నివాళి అర్పించారు. కార్పొరేటర్లు, ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎంఈ చంద్రశేఖర్, ఎంహెచ్‌వో యువ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

9న శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల, జూలై4(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయశుద్ధి) నిర్వహించనున్నారు. జూలై 16న ఆణివార ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 9న ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటల పాటు కొనసాగనుంది. అనంతరం స్వామి మూలవిరాట్టుకు ఆలయఅర్చకులు ఆగమోక్తంగా పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారం నిర్వహించే అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

రుయా ఇన్‌చార్జి ఏడీని కలిసిన ఎన్జీవోలు



తిరుపతి(వైద్యం), జూలై 4 : రుయా స్మృతి పరిపాలనా విభాగం ఇన్‌చార్జి ఏడీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముని రమేష్‌ను ఏపీఎన్జీవోస్ నేతలు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్, కార్యదర్శి బాలాజీ, నేతలు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



తిరుపతి రూరల్, జూలై4: పుదిపట్ల పంచాయతీల్లో గురువారం వంగవీటి రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. చెర్లోపల్లె ఉపసర్పంచ్ చంద్రప్రసాద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రుద్రయ్య, రామకృష్ణ, శంకర్, స్వామి, నరేష్, రాజశేఖర్, శివ, రవి, వెంకటపతి, రుషి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివేకానందుడికి బీజేపీ నివాళి



తిరుపతి (ఉపాధ్యాయనగర్), జూలై 4: స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఎస్వీ మెడికల్ కళాశాల సర్కిల్‌లోని వివేకానందుడి పూలమాలలు వేశారు. నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, మల్లారపు రవిప్రసాద్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, యువమోర్చా నాయకులు దీపక్‌యాదవ్, కళాకారుడు శాంబోల హరినాథ్, మురళి, చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లు లేకుండా పనులెలా చేస్తారు?

- పుంగనూరులో అర్ధరాత్రి పీఎల్ఆర్ కంపెనీ తారు రోడ్డు నిర్మాణం
- అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- పోలీసుల జోక్యంతో సాగిన పనులు


రోడ్డు పనులను అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు..

పుంగనూరు, జూలై 4: ఇంజనీర్లు లేకుండా రోడ్డు పనులు ఎలా వేస్తారంటూ టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. పుంగనూరులో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పీఎల్ఆర్ కంపెనీ వేస్తున్న తారు రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చౌడేపల్లె రోడ్డులో గతంలో కాంట్రాక్టర్ తారు రోడ్డు వేసి రెండోలేయర్ బీసీ సెన్సార్ ఫ్లేవర్ వేయాల్సిఉంది. కొద్ది రోజులుగా పుంగనూరులో వైసీపీకి ఎదురుగాలి వీస్తుండటంతో అసంపూర్తి పనులు అర్ధరాత్రి ముగించాలని భావించారు. ఈ క్రమంలో తారు మిక్సింగ్ టిప్పర్, యంత్రాలు వచ్చి రోడ్డుపని మొదలు పెట్టాయి. దీనిని గమనించిన టీడీపీ శ్రేణులు అర్ధరాత్రి రోడ్డు వేయడం ఏంటని, ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు ఎక్కడ ఉన్నారంటూ, దొంగగా ఎవరూలేని సమయంలో రోడ్డు వేయరాదంటూ పని ఆపాలని అడ్డుకున్నారు. దీంతో రెండు వాహనాల్లో పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి మళ్లీ 11.30 గంటలకు పనులు చేసుకోవాలని సూచించారు. తారురోడ్డు వేసేముందు ఎయిర్‌కంప్రెషన్‌తో శుభ్రం చేయాలని, సెన్సార్ ఫ్లేవర్‌తో వేయాల్సిన రోడ్డు మెకానికల్ ఫ్లేవర్‌తో వేస్తూ తారు లిక్విడ్ వేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ అధికారులు లేకుండా అక్రమంగా రోడ్డు వేస్తున్నారని, ఈపనికి ముందే బిల్లు అయిపోయి ఉంటుందనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామని వారు తెలిపారు. ఏదైనా ఉంటే శుక్రవారం చూసుకోండని, వాళ్లు రోడ్డు వేసుకుంటారని చెప్పి పోలీసులు టీడీపీ వాళ్లను పంపేశారు. ఆ తర్వాత చకచకా రోడ్డు పనులు చేశారు.

చంద్రబాబు పోస్టరుకు ఆవు పేడ

- వైసీపీ కన్వీనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

శాంతిపురం, జూలై 4: శాంతిపురం మండలం కడపల్లె సచివాలయం గోడకు అంటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టరుకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఆవు పేడ పూశారు. ఇది మండల వైసీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి పనేనంటూ టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ కనుమలదొడ్డికి చెందిన దండపాణి వర్గీయులు ఆవు పేడను పూసి అశుభ్రపరిచారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ఈ నెల ఒకటిన పెన్షన్ పంపిణీ సందర్భంగా సచివాలయం గోడకు ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టరును అతికించి లబ్ధిదారులు పాలాభిశం చేశారు. బుధవారం రాత్రి దండపాణి అనుచరులు జన్మదిన వేడుకలు జరుపుకొని హంగామా చేశారు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు చంద్రబాబు పోస్టరుకు ఆవుపేడ పూయడాన్ని గమనించిన స్థానికులు టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. వాళ్లు అక్కడికి వచ్చి.. పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణకు తెలిపారు. దీంతో కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, దండపాణి కోసం పోలీస్ స్టేషన్ వద్దకు ఎమ్మెల్సీ భరత్ రాగా.. సీఎం పోస్టరుకు పేడ పూసి అవమానించిన వ్యక్తికి సపోర్టుగా రావడం సరికాదంటూ టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాగ్వాదంతో స్టేషన్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపేశారు.

చెరువు స్థలంలో హైస్కూల్ భవన నిర్మాణమా?


చెరువులో నిర్మిస్తున్న కొత్త స్కూల్ భవనం

తిరుపతి రూరల్, జూలై 4: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో నిబంధనలకు విరుద్ధంగా చెరువు స్థలంలో హైస్కూల్ భవన నిర్మాణం చేపట్టడం దారుణమని గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రచారకార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. గ్రామంలో నాడు-నేడు సెకండ్ ఫేజ్‌లో భాగంగా దాదాపు రూ.84లక్షలతో చేపడుతున్న జడ్పీ హైస్కూల్ అదనపు తరగతి గదుల భవనాన్ని గురువారం టీడీపీ గ్రామకమిటీ కార్యదర్శి చెంగల్రామానాయుడు, వార్డుసభ్యుడు రాధారాయల్‌తో కలసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నెంబరు 60లో చెరువుకు రక్షణగా ఉన్న కట్టను చదును చేసి నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. అసలు ఈస్థలంలో నిర్మాణపనులకు రెవెన్యూ అధికారులు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. కొత్తగా నిర్మిస్తున్న భవనానికి ఆనుకుని గ్రామానికి చెందిన పెద్ద మురుగు కాలువ పారుతుందని, ఈమురుగు వ్యర్థాలతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనికితోడు గతంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామమంతా నీరుచేరి.. ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని, ఇలాంటి పరిస్థితిల్లో రానున్న రోజుల్లో చెరువులోకి నిండుగా నీరుచేరితే విద్యార్థులకు రక్షణ ఎవరు కల్పిస్తారని అన్నారు. గతంలో బలమైన పునాదులతో నిర్మించిన జడ్పీహైస్కూల్ భవనంపైనే మరో అంతస్తువేసి.. అదనపు తరగతి గదులు నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ చెరువుస్థలంలో కొత్త నిర్మాణాలు ఎలా చేపడతారని ధ్వజమెత్తారు. అలాగే చెరువుకు సంబంధించిన సర్వేనెంబరు 61,62లో కట్టని తొలగించి కొత్త సచివాలయభవనం, సమావేశ మందిర భవనాలను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లి.. బాధ్యులైన వారిపై తగు చర్యలు చేపట్టాలని కోరతామని చెప్పారు. టీడీపీ నాయకులు కె.భాస్కర్ రెడ్డి, మణి తదితరులు పాల్గొన్నారు.

భవననిర్మాణ మెటీరియల్ చోరీ

హైస్కూల్ నూతన భవననిర్మాణ మెటీరియల్ చోరీకి గురైన ఘటన రెండ్రోజులు ఆలస్యంగా వెలుగుచూసింది. పాఠశాలకు సమీపంలోని సమావేశమందిరంలో భద్రపరిచిన నిర్మాణ సామగ్రికి చెందిన రెండు వందల కిలోల ఐరన్ మంగళవారం రాత్రి చోరీకి గురైనట్లు పాఠశాల హెచ్ఎం ద్వారా సమాచారం అందిందని గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రచారకార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. రేకుల పైకప్పు ఉన్న ఈ మందిరానికి వేసిన తాళాలు వేసినట్లే ఉండగా.. పైభాగంలో నుంచి లోపలికి దిగి 200 కిలోల ఎల్ యాంగిల్ ఐరన్‌రాడ్లను తీసుకెళ్లారని చెబుతున్నారు. ఈవిషయాన్ని గురువారం తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలియపరచగా.. ఎస్ఐ పరమేశ్వరనాయక్ సందర్శించి వివరాలు సేకరించారు. హెచ్ఎం లీవు నుంచి వచ్చాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని అంటున్నారని చెప్పారు. కాగా.. రాత్రిపూట ఈ ప్రాంతంలో ఆకతాయిలు మద్యం, మత్తు పానీయాలు తాగి పెద్దపెద్దగా కేకలు వేస్తున్నారని, గస్తీ నిర్వహించాలని ఎస్ఐని కరుణాకరరెడ్డి కోరారు. నాయకులు చెంగల్రాయనాయుడు, రాధారాయల్, కె.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐకి వివరిస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి

తోపుడు బండ్లు సరే.. వీటిని తొలగించరా?

నగరంలో అడ్డగోలుగా ఐరన్ బంకుల ఏర్పాటు




గరుడవారధి కింద..



రాస్ కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌పై..

ఫుట్‌పాత్‌ల వద్ద పొట్టకూటి కోసం పెట్టుకున్న తోపుడు బండ్లపై మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన ఐరన్ బంకులను మాత్రం టచ్ చేసేందుకు యంత్రాంగం భయపడుతున్నట్టు కనిపిస్తోంది. వైసీపీ నాయకులు ఏర్పాటుచేసిన బంకులను వేలాది రూపాయలకు అద్దెకిచ్చి ఇప్పటికీ వసూళ్లు చేసుకుంటున్నారు. తుడా కార్యాలయం ఎదురుగా, బాలాజి రిజిస్ట్రార్ కార్యాలయం గోడకు ఆనుకుని 2021 ఫిబ్రవరి 11న రాత్రికి రాత్రే బంకు వెలిసింది. వైసీపీ యువనేత అనుచరుడొకరు స్థానిక నాయకుల చొరవతో పెద్ద బంకును ఏర్పాటు చేసుకున్నారు. తొలుత టీ, టిఫిన్ సెంటర్ పెట్టి కొంతకాలం తర్వాత దానిని రెండు భాగాలుగా విభజించి, డాక్యుమెంట్ రైటర్‌కి కొంత భాగం, కూల్‌డ్రింక్ షాపు మరొకటి ఏర్పాటుచేశారు. నెలకు రూ.20వేల అద్దె వైసీపీ నాయకులకు వెళుతున్నట్టు తెలుస్తోంది. అలాగే ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ కార్యాలయం ఫుట్‌పాత్ వద్ద కూడా మరో బంకు వెలిసింది. ఇక్కడ కూడా రాజకీయ నేతల ఒత్తిళ్ల కారణంగా వదిలేశారు. అదేవిధంగా విష్ణునివాసం సమీపంలోనూ, గరుడవారధి (శ్రీనివాస సేతు) కింద కూడా నిబంధనలకు విరుద్ధంగా బంకులు వెలిశాయి. కార్పొరేషన్ యంత్రాంగం వీటిపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బాలాజీ రిజిస్ట్రార్ కార్యాలయం గోడకు..

సీఆర్వోకి శ్రీవాణి కౌంటర్లు

ట్రస్టుకు విరాళాలిచ్చే భక్తులకు పెరగనున్న ఇబ్బందులు



ఈవో కార్యాలయంలోని శ్రీవాణి ట్రస్టు కౌంటర్లు

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రస్తుతం ఈవో కార్యాలయంలో ఉన్న శ్రీవాణి టికెట్ల కౌంటర్లను సీఆర్వోకు తరలించాలనే నిర్ణయం వల్ల భక్తులకు ఇబ్బందులు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ కౌంటర్లలో రూ.10500లు చెల్లించిన వారికి మరుసటి రోజుకు వీఐపీ బ్రేక్‌లో దర్శనం కేటాయిస్తున్నారు. తొలుత ఈ కౌంటర్‌ను తిరుమలలోని ఈవో కార్యాలయంలోనే ఏర్పాటు చేశారు. రద్దీ అధికంగా ఉందని ఆ తర్వాత తిరుపతికి మార్చారు. అక్కడ కూడా భక్తుల క్యూలైన్లు పెరిగిపోవడం, ట్యాక్సీ, ఆటోడ్రైవర్లు శ్రీవాణి టికెట్లతో అక్రమాలకు పాల్పడుతున్నారనే కారణాలతో తిరిగి తిరుమలకు మార్చారు. గోకులం విశ్రాంతి భవనంలోని ఈవో కార్యాలయంలో రెండు కౌంటర్లు నడిచేవి. ఎన్నికల సమయంలో అదనంగా రెండు కౌంటర్లు ప్రారంభించారు. ప్రస్తుతం మొత్తం నాలుగు కౌంటర్ల ద్వారా రోజుకు దాదాపు వెయ్యి మందికి శ్రీవాణి టికెట్లు కేటాయిస్తున్నారు. ఇదే కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, రాజ్యాంగ హోదా కలిగిన ప్రముఖులకు కూడా సిఫార్సు లేఖలు తీసుకుని వీఐపీ బ్రేక్ టికెట్లను కేటాయిస్తుంటారు. ఈక్రమంలో కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది తమకు శ్రీవాణి ట్రస్టు కౌంటర్లు ఇబ్బందిగా మారాయని, అలాగే వెనుకభాగంలోని ఈవో సమావేశానికి కూడా సమస్యగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో సీఆర్వోకు మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే అత్యంత రద్దీగా ఉండే సీఆర్వోకు ఈకౌంటర్లు మార్పిడి చేస్తే శ్రీవాణీట్రస్టు దాతలకు ఇబ్బందులు అధికమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సీఆర్వోలో లక్కీడిప్ ఆర్జితసేవల కోసం, నూతన వధూవరుల కల్యాణోత్సవం దర్శనాల కేటాయింపులు, సిఫారసు గదుల కేటాయింపు, సాధారణ గదుల కేటాయింపు వంటివి జరుగుతున్నాయి. భారీ క్యూలతో సీఆర్వో నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. శ్రీవాణి కౌంటర్లు కూడా ఇక్కడే సర్దితే భక్తులకు అవస్థలు తప్పవు. సీఆర్వోకు బదులు ఎంబీసీకి ఈ కౌంటర్లు మార్చినా ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. ఎంబీసీలో సిఫార్సులపై ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు మధ్యాహ్నం తర్వాత కేటాయిస్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కౌంటర్లు ఖాళీగానే ఉంటాయి కాబట్టి వీటిని వినియోగించుకోవచ్చు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.32 కోట్లు

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.32 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 69,632 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,179 మంది తలనీలాలు సమర్పించారు.

10నుంచి ఎస్వీయూ పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 4: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల పదో తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ దాకా కొనసాగుతాయి. యూనివర్సిటీ పరిధిలోని 14 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు సుమారు 3వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు అంచనా. అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

వచ్చేనెల 9నుంచి నృత్యపోటీలు

తిరుపతి (కల్చరల్), జూలై 4: శ్రీకృష్ణదేవరాయలు వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు తొమ్మిది నుంచి 11వ తేదీవరకు మహతి కళాక్షేత్రంలో నృత్యపోటీలు నిర్వహించనున్నట్లు రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు పోటీ చేయవచ్చన్నారు. ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రెండు గ్రూపుల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు ఆసక్తి గల కళాకారులు ఈనెల 20వ తేదీలోగా రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కేఎస్ రాజ (సెల్ నెంబరు 93470 46608)ను సంప్రదించి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్నూలు జిల్లా కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలంగాణ ఎంఎల్సీ రఘోత్తమరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

గేట్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



తిరుపతి(విద్య), జూలై 4: చిగురువాడలోని గేట్ కళాశాలలో సత్య ఇన్ఫోటెక్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఇందులో తమ విద్యార్థులు 48 మంది ప్లేస్‌మెంట్లు పొందారని కళాశాల కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రణీత్, రమేష్, రాజశేఖర్, సత్య ఇన్ఫోటెక్ సీఈవో గిరీష్‌తో కలిసి కరస్పాండెంట్ అభినందించారు.

ఎస్వీఎంసీడబ్ల్యూ దంత విభాగంలో ఎక్స్‌రే సేవలు

తిరుపతి(వైద్యం), జూలై 4: స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల(ఎస్వీఎంసీడబ్ల్యూ) అనుబంధ ఆస్పత్రిలోని దంత వైద్య విభాగంలో రేడియాలజీ ఇంట్రాయోరల్ పెరియాపికల్ రేడియోగ్రాఫ్(ఐవోపీఏ) ఎక్స్‌రేతోపాటు రేడియో వేడియోగ్రామ్(ఆర్వీవి) సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి అత్యాధునిక పరికర సేవలను రోగుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నీటి సమస్యను పట్టించుకోరా?

తిరుపతి(కొర్లగుంట), జూలై 4: నీటి సమస్యను పట్టించుకోక పోవడంతో ఎంఆర్‌పల్లె ఎస్టీ నగర్ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని టీడీపీ బీసీ శాలివాహన పార్లమెంటు అధ్యక్షుడు ఆముదాల తులసీరాస్ ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజులుగా ఈ సమస్యను తెలియజేస్తున్నా నగరపాలక సంస్థలోని సంబంధిత విభాగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం పోయి నెల కావస్తున్నా అధికారులు ఇంకా వారి మాయలోనే ఉన్నారని మండిపడ్డారు. నీటి సమస్యను పరిష్కరించకుంటే ఎంఆర్‌పల్లె కూడలిలో నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

రేపు వెటర్నరీ వర్సిటీలో జూనోసిస్ డే

- పెంపుడు జంతువులకు ఫ్రీ వ్యాక్సినేషన్

తిరుపతి(రూరల్), జూలై 4: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో శనివారం ప్రపంచ జూనోసిస్ డే నిర్వహిస్తున్నట్లు క్లినికల్ కాంప్లెక్స్ హెడ్ డాక్టర్ వైకుంఠరావు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని పెంపుడు జంతువులకు ఉచిత యాంటీ రేబీస్ టీకాలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్సిటీలోని వీసీసీ, తాతయ్యగుంటలోని పట్టణ పశువైద్యశాలలో ఫ్రీ వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామన్నారు. జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువుల(శునకాలు, పిల్లులు)కు టీకాలు వేయించాలని కోరారు.

శాఖాపరమైన విచారణ వేగిరపరచండి

రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల వేడుకోలు



మీడియాతో మాట్లాడుతున్న జయచంద్ర

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 4: ఉత్త పుణ్యానికి శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల కేసులను త్వరగా పరిష్కరించి ఆదుకోవాలని విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.జయచంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఏసీబీ, ప్రభుత్వ ఆస్తులు, ధనాన్ని కాజేసిన కేసుల విషయంలో తాము సహాయాన్ని అర్థించడం లేదన్నారు. కానీ రెవెన్యూ శాఖలో చాలామంది ఉద్యోగులు అక్రమాలకు పాల్పడకుండానే క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటివారు రిటైర్ అయ్యాక ఆర్థికంగా, కుటుంబపరంగా చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కేసుల్లో విచారణాధికారులు త్వరగా విచారణ పూర్తిచేయక పోవడంతో పెన్షన్, ఇతర ప్రయోజనాలు అందక వారి జీవనం అస్తవ్యస్తం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే మతి చలించి తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికారులు అత్యంత నిర్దయగా వ్యవహరిస్తున్నారన్నారు. కొందరు అధికారులైతే భరించలేని భాషను వాడుతూ.. అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలపై విచారణ ఎదుర్కొంటున్నవారు జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారి కేసులను సత్వరం విచారించి.. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని విన్నవించారు. ఇప్పటికే అధికారుల చుట్టూ తిరిగి, ప్రెస్‌మీట్లు పెట్టి వయోభారంతో అలసిపోయానని, ఇదే చివరి ప్రెస్‌మీట్ అని గద్గద స్వరంతో అన్నారు. సమావేశంలో విశ్రాంత ఉప తహసీల్దార్ వీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

170 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఓ స్మగ్లర్ అరెస్టు, రెండు కార్ల సీజ్




పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో ఫ్లయింగ్ స్క్వాడ్, పుత్తూరు అటవీశాఖ సిబ్బంది

మంగళం, జూలై 4: రెండు ఘటనల్లో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్, పుత్తూరు అటవీశాఖ అధికారులు గురువారం 170 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి, రెండు కార్లను సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్‌కు అందిన సమాచారంతో సిబ్బంది పుత్తూరు మండలం గొల్లపల్లె మామిడి తోపు వద్ద తనిఖీలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో అటువైపు వస్తున్న ఓ కారును ఆపేందుకు ప్రయత్నించారు. ఆగకుండా వెళ్లిపోవడంతో ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది వెంబడించారు. కొద్దిదూరం వెళ్లాక నిందితులు వాహనాన్ని వదిలి మామిడితోటలోకి పారిపోయారు. అధికారులు తనిఖీ చేయగా వాహనంలో ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. దాంతో వాహనాన్నీ, అందులోని 125 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయానికి తరలించారు. ఈ దుంగల బరువు 947 కిలోలు ఉంటుందని డీఎఫ్‌వో శివకుమార్ తెలిపారు. అలాగేపుత్తూరు అటవీశాఖ అధికారులు కేవీబీపురం నుంచి పిచ్చాటూరు వెళ్లే రహదారిలో తనిఖీలు చేపట్టారు. ఓ కారు మారప్పరెడ్డికండ్రిగ వద్ద అనుమానాస్పదంగా ఉండగా అధికారులు చుట్టుముట్టారు. తనిఖీ చేయగా వాహనంలో 45 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. దాంతో దుంగలతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అందులోని ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. పట్టుబడ్డ దుంగల బరువు 327.9 కిలోలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో తిరుపతి ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది ప్రసాద్ కుమార్, డ్రైవర్లు సాయి, కిరణ్, షణ్ముగం, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది మునస్వామి, వినీల్‌కుమార్, పుత్తూరు అటవీశాఖ సిబ్బంది చైతన్య, సురేష్‌కుమార్, నీలకంఠం, వాసు, గోపి, రఘు, సింహాద్రి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ప్రక్షాళన జరగాలి : బీజేపీ

తిరుపతి (జీవకోన), జూలై 4: నగరపాలకసంస్థలో ప్రక్షాళన జరగాలని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా నగరపాలక సంస్థ మారడమే కాకుండా, అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిందని ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్‌శాఖల్లో సుదీర్ఘకాలంగా తిష్ఠవేసి అవినీతిని పెంచి పోషిస్తున్న అక్రమార్కుల భరతం పట్టాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో ప్రజలు కట్టిన ఆస్తి పన్నుల నగదును నాసిరకం ఇంజనీరింగ్ పనులకు వాడేశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తునకు స.హ. చట్టం ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. మంగళంరోడ్డులో వినాయకసాగర్ అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలను మంచినీళ్లలా ఖర్చుచేసి.. కమీషన్లు దండుకున్నారని విమర్శించారు. అవినీతి తిమింగలాల అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించాలని కోరారు. మరోవైపు వెంటనే ప్రక్షాళన జరిగేలా సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు సాక్ష్యాధారాలతో తెలియజేస్తామన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి(విద్య), జూలై 4: నగరంలో గురువారం విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. నీట్, నెట్ పరీక్ష పేపర్లు లీక్ అవడాన్ని నిరసిస్తూ.. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌వో, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ముందుగానే సెలవు ప్రకటించి.. విద్యాసంస్థలను మూసివేయడంతో బంద్ ప్రశాంతంగా ముగిసింది. కాగా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, టీటీడీ విద్యాసంస్థలు మాత్రం యథావిధిగా నడిచాయి.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీల్లో అనేక విభాగాల్లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఆది, తదితరులు ప్రసంగించారు. విద్యార్థి సంఘాల నాయకులు హరికృష్ణ, చంద్ర, నరేంద్ర, యుగంధర్ పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచండి



లోకేశ్‌తో సుబ్రమణ్యం నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 4: యూనివర్సిటీల్లోని నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని ఎస్వీయూ ఉద్యోగి ఆముదాల సుబ్రమణ్యం నాయుడు కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్‌ని విజయవాడలో గురువారం కలిసి విన్నవించారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రక్షక్ పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 4: సైబర్ క్రైమ్, చైన్ స్నాచింగ్‌లు, మొబైల్ దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హర్షవర్ధన రాజు సూచించారు. గురువారం ఎస్పీ ఆదేశాలతో మహిళా రక్షక్ పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు తెలియజేశారు.


చిరస్మరణీయుడు అల్లూరి



అంధులకు పండ్లు అందజేస్తున్న బలరామరాజు, శ్రీదేవి తదితరులు

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని, క్షత్రియ జాతికి ఆదర్శనీయుడని క్షత్రియ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బలరామరాజు, రాజు క్షేత్రాణి ఐక్యవేదిక అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి, కన్వీనర్ వసంత రాజు, రాయలసీమ రాజుల రాజకీయ చైతన్య వేదిక ఉపాధ్యక్షుడు కీర్తిపాటి రాధాకృష్ణ మారాజు (నాని), నీలకంఠమరాజు అన్నారు. గురువారం అల్లూరి జయంతి వేడుకలను శివజ్యోతి నగర్ వద్ద ఉన్న ప్రభుత్వ అంధుల శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పంచిపెట్టారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.

సీఎంను కలిసిన బీజేపీ నేత



తిరుపతి (ఉపాధ్యాయ నగర్), జూలై 4: బీజేపీ రాష్ట్ర ఓబీసీ నాయకుడు, తిరుపతికి చెందిన జల్లి మధుసూదన్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఢిల్లీలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిశారు. రాష్ట్రంలో ఓబీసీలు సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థించారు. అనంతరం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజును కలిశారు. ఏపీలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఇప్పటికే ఉన్న పరిశ్రమలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

త్వరలో వంగవీటి విగ్రహం ఏర్పాటు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ఆరణికి కేకు తినిపిస్తున్న ఊకా విజయకుమార్

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన పేదల పెన్నిధి వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అనంత వీధి కూడలి వద్ద గురువారం రాధారంగా మిత్రమండలి, బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా శత జయంతి వేడుకలను నిర్వహించారు. టీడీపీ నాయకుడు ఊకా విజయకుమార్, రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ప్రసంగించగా, నాయకులు ఆముదాల తులసీరావ్, బెల్లం కొండ సురేష్, నీలాద్రి, షేక్ మౌలా, వెంకట కృష్ణ, సుబ్బా, అంజి బాబు, ఆర్కాట్ సాయి, తోట జయంతి, కోకిల, ఆళ్వార్ మురళి, కూరగాయల ప్రసాద్, గోపి రాయల్, అవిశెట్టి ప్రభాకర్, శెట్టిపల్లి చరణ్, వంశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు అభినందనలు





కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి, జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్, ఏపీ హంస నేతలు

తిరుపతి(ఆర్టీసీ/వైద్యం), జూలై 4: కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌కు గురువారం పలువురు అభినందనలు తెలిపారు. వీరిలో ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి,డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, క్రీడాధికారి సయ్యద్ సాహెబ్, ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా, నేతలు టాటాబాయి, ఇమ్రాన్, భాస్కర్, గిరి శ్రీనివాస్, వాణిశ్రీ, శ్రీదేవి ఉన్నారు.



టీటీడీ మాజీ జేఈవో, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజుకు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అర్చకులు తదితరులు

తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలు నడపాలి


మంత్రి రామ్మోహన్‌నాయుడితో వరప్రసాద్

గూడూరు, జూలై 4: తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం ఢిల్లీలో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోనాయుడిని కలిసి విన్నవించినట్లు మాజీ ఎంపీ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ 2014-15 సంవత్సరంలో తాను తిరుపతి ఎంపీగా, చంద్రబాబు రాష్ట్ర సీఎంగా, నరేంద్రమోదీ పీఎంగా ఉన్న సమయంలో తిరుపతి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా పరిగణించాలని పీఎం, సీఎంలను కోరానని చెప్పారు. దీంతో అప్పటి సీఎం చంద్రబాబు తిరుపతి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చినట్లు పేర్కొన్నారు. అయినా పదేళ్లుగా విదేశాల నుంచి ఇక్కడికి ఎటువంటి విమానాల రాకపోకలు జరగలేదన్నారు. ప్రధానంగా తిరుమల పుణ్యక్షేత్రం కావడంతో వివిధ దేశాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే ఆస్కారం ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై రామ్మోనాయుడు సానుకూలంగా స్పందిస్తూ మొదటగా గల్ఫ్ దేశాలకు తిరుపతి నుంచి విమానాల రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు.

అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు


నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్‌లు, కమిషనర్ తదితరులు

నాయుడుపేట, జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తికి ప్రతీతి అని, ఆయన చిరస్మరణీయుడని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ రఫీ, జలదంకి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, షబ్బీర్, నాయకులు పాలూరు భాస్కర్, పసల చెంగయ్య, కరీంబాయి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని ఎంపీడీవో, ఎంఈవో ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, శివకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు సుధాకర్, వంశీకృష్ణ, ఏఎస్‌వో మోహన్, సర్వేయర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాల్లో మార్పులు చేయాలి


కోర్టు గేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, జూలై 4: నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన చట్టాలలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోర్టు గేట్ వద్ద నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు చెంచు కృష్ణయ్య, దశయ్య, రఫీ, ఈశ్వరయ్య, రమణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలి

నాయుడుపేట టౌన్, జూలై 4: ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని నాయుడుపేట డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ ప్రసన్నకుమార్ తెలిపారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో విద్యుత్ వినియోగదారులు గూగుల్‌పే, ఫోన్‌పే, అమేజాన్‌పే వంటి యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించేవారని, ప్రస్తుతం ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారానే చెల్లించాలని చెప్పారు. ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఇబ్బందులు ఉన్నవారు బిల్ కలెక్టర్ల ద్వారా గాని, వీఆర్‌వో సెంటర్ల ద్వారా గాని చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపారు.

రంగాకు నివాళులు



నాయుడుపేట టౌన్, జూలై 4: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని దర్గా సెంటర్ వద్ద ఆయన చిత్రపటానికి గురువారం బలిజ సంఘ నాయకులు నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బలిజసంఘ నాయకులు కుబేరు మణి, గంధాల చిట్టి, ప్రసాద్, శేషం మునిగోపీ, రాజాబాబు, దాము, బాబు, లక్ష్మీనారాయణ, సతీష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో శ్రీకృష్ణదేవరాయ, కాపు, బలిజ, తెలగ ట్రస్ట్ కార్యాలయంలో ఆల్‌ఇండియా రాయల్‌కాప్స్ జనరల్ సెక్రటరీ తోట కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం వంగవీటి మోహన్ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వీకే ప్రసాద్, జ్యోతిరావు, తిరుపాల్, ఫకీర్ ఆనంద్, రాజా, గద్దల మునెయ్య, జనసేన నాయకురాలు అన్నపూర్ణ, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం



నాయుడుపేట టౌన్, జూలై4: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని నాయుడుపేట న్యాయవాదులు సన్మానించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీకి శాలువాకప్పి సన్మానించారు. న్యాయవాదులు పార్థసారథిరెడ్డి, సోమశేఖర్, దశయ్య, చెంగయ్య, రమణయ్య, శ్రీనివాసులు, కిరణ్, అంజయ్య, సుమన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోండి

దొరవారిసత్రం, జూలై 4: రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి కోరారు. గురువారం ఆమె మండలంలోని పోలిరెడ్డిపాళెం, వెదురుపట్టు గ్రామాల్లో పర్యటించి, రైతులకు మట్టి నమూనా పరీక్షల గురించి తెలియజేశారు. ప్రతి రైతు తమ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లోని తమ సిబ్బంది వద్దకు వెళ్లి మట్టినమూనా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సాగులో ఉన్న వరి పొలాలను పరిశీలించారు. వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు తెగుళ్లను గుర్తించి, నివారణ కోసం పిచికారి మందులను రైతులకు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తడ, జూలై 4: మండల పరిధిలోని వేనాడులో గుళికల మందు తాగి సామతాళం రమేష్ (26) ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు వేనాడు పంచాయతీ ఆలాపత్రి గిరిజన సెంటర్‌కు చెందిన సామతాళం రమేష్ ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెందిన మద్యంలో గుళికలు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరూ పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటరు సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూలై 4: మండలంలోని బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో మోటరు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని అరవపెరిమిడి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులు సూళ్లూరుపేట వైపు నుంచి నాయుడుపేటకు మోటరు సైకిల్‌పై వస్తూ మార్గమధ్యంలో బిరదవాడ సమీపంలో రోడ్డు పక్కన ఆగారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి మోటరు సైకిల్‌పై వస్తున్న చైతన్య.. వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు, చైతన్యకు గాయాలు కాగా, రాజేశ్వరి స్వల్పగాయాలతో బయటపడింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం



గూడూరు, జూలై 4: స్థానిక నలజాల మ్మవీధికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తికి వైద్యఖర్చుల నిమిత్తం గురువారం టీడీపీ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు పరిమల రాజేష్ మాట్లాడుతూ సుబ్బారావు అనే టీడీపీ కార్యకర్త కిడ్నీవ్యాధితో బాధపడుతుండటంతో వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశామన్నారు. దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రేబిస్‌వ్యాధి టీకాలు

గూడూరు అర్బన్, జూలై 4: పెంపుడు జంతువులకు జూలై 6వ తేదీన ఉచితంగా రేబిస్ వ్యాధి టీకాలు వేయనున్నట్లు పశుసంవర్థశాఖ ఏడీ డాక్టర్ సురేష్ గురువారం తెలిపారు. జూలై 6వ తేదీన జొనోటిక్ డేను పురస్కరించుకుని టీకాలను ఉచితంగా వేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులకు ఈ టీకాలను వేయించుకోవాలన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

పెళ్లకూరు, జూలై 4: మండలంలోని శిరసనంబేడులో కౌలు రైతులకు గురువారం గుర్తింపు కార్డులు అందజేశారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఆర్వో మోబీనా, వీఏఏ చందు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధుల లెక్కలు తేల్చండి


ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ ఎంపీటీసీలు

కోట, జూలై 4: కోట మండల పరిషత్ నిధుల లావాదేవీలపై లెక్కలు తేల్చాలంటూ గురువారం టీడీపీ ఎంపీటీసీలు, నాయకులు ఎంపీడీవో కార్యాలయ అధికారులను నిలదీశారు. మండల పరిషత్‌లో సుమారు రూ.70 లక్షల వరకు పక్కదారి పట్టాయని, ఎలాంటి లెక్కలు లేవని, లావాదేవీలు అనధికారికంగా జరిగాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తక్షణం లెక్కలు చెప్పాలని ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్, మైనార్టీసెల్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్‌లు పట్టుపట్టారు. ఎంపీడీవో శంకరయ్య సెలవులో ఉన్నారని, సోమవారం వస్తారని, నిధులపై తమకు ఎలాంటి సమాచారం తెలియదని మండల పరిషత్ సిబ్బంది తెలిపారు. దాంతో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులకు మండలపరిషత్ నిధులు లెక్కలు తేల్చాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు.

నిరుపేద విద్యార్థిని ఆదుకున్న పాశం


నానీశ్రీరామ్ తల్లికి నగదును అందజేస్తున్న టీడీపీ నేతలు

కోట, జూలై 4: మండల పరిధిలోని చెందోడు గ్రామానికి చెందిన నానీశ్రీరామ్ అనే పేద విద్యార్థికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అండగా నిలిచి భరోసా పంపారు. చీరాలకు చెందిన రాజా అనే యువకుడు విద్యానగర్‌లో కాపురం ఉంటూ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన భార్య సాయికుమారి, కుమారుడు నానీ శ్రీరామ్‌లు అనాథలుగా నిలిచి రోడ్డునపడ్డారు. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే టీడీపీ నాయకుల ద్వారా నానీశ్రీరామ్ చదువుతున్న పాఠశాలకు కట్టాల్సిన ఫీజులు రూ.15వేలు, యూనిఫాం, పుస్తకాలకు మరో రూ.10వేలను సునీల్‌కుమార్ పంపారు. ఆయా నగదును టీడీపీ జిల్లా కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, లోక్కు రఘునాథరెడ్డి, బందిలి రఘురామయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్ చేతులమీదుగా సాయికుమారికి అందజేసి, పాఠశాల ఫీజులు చెల్లించారు. చేశారు.

వాహనం ఢీకొని నెల్లూరువాసి దుర్మరణం


సురేంద్ర మృతదేహం

చంద్రగిరి, జూలై 4: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నెల్లూరు వాసి దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన సురేంద్ర(40).. చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లె వద్ద ఉన్న నారాయణ కళాశాలలో మెస్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి నాగయ్యగారిపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై నారాయణ కళాశాలకు బయల్దేరాడు. మార్గమధ్యంలో పీలేరు, తిరుపతి జాతీయ రహదారిలో నాగయ్యగారిపల్లె వద్ద మలుపులో రాత్రి 10.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నవ్యాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఎమ్మెల్యే విజయశ్రీ


కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట టౌన్, జూలై 4: నవ్యాంధ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని తుమ్మూరులో గురువారం రాత్రి జరిగిన విజయోత్సవ అభినందనసభలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా లోన్‌లు మంజూరు చేసి పేదలను ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. తరువాత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యంచేసి పేదల కడుపుకొట్టిందని విమర్శించారు. ఓటు అనే వజ్రాయుధం ద్వారా ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని, రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. అంతకుముందు తుమ్మూరులో భారీ ర్యాలీతో కరిమాణిక్య స్వామి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్‌చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తరుమూరు సుధాకర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, 786 రఫీ, నెలవల రాజేష్, శివకుమార్‌రెడ్డి, తుమ్మూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గాయపడిన బాలుడి మృతి


భరత్‌కుమార్ (ఫైల్ ఫొటో)

పెళ్లకూరు, జూలై 4: ఇటీవల విద్యుదాఘాతంతో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు పెళ్లకూరు మండలం చిల్లకూరు దళిత కాలనీకి చెందిన నెలబల్లి మహేష్, భువనేశ్వరి దంపతుల కుమారుడు భరత్ కుమార్ (15) 9వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో మే 19వ తేదీన స్నేహితులతో కలసి కాలనీ సమీపంలోని పాత పరిశ్రమ సమీపంలో క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో క్రికెట్ బాల్ సమీపంలోని పాత పరిశ్రమ ఆవరణలో పడటంతో దానిని తెచ్చేందుకు భరత్‌కుమార్ ప్రహరీని ఎక్కి దాటే సమయంలో కిందకు వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో బాలుడికి రెండు కాళ్లు, చేతులతో పాటు శరీరభాగాలు కాలిపోయాయి. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్సలో భాగంగా భరత్‌కుమార్ రెండు కాళ్లను జూన్ 1వ తేదీన తొలగించారు. అయినప్పటికీ భరత్‌కుమార్ ఆరోగ్యం కుదుటపడలేదు. సుమారు రెండు నెలలు మృత్యువుతో పోరాడి చివరకు భరత్‌కుమార్ ప్రాణాలు కోల్పోయాడు. చాలా కాలంగా విద్యుత్ తీగలు ప్రమాదకర స్థితిలో ఉండటం, ఆశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయినా పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. రెండు నెలలు పాటు మృత్యువుతో పోరాడి చివరకు తమ బిడ్డ మృతి చెందాడంటూ ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తమ బిడ్డకు 15 ఏళ్లకే నూరేళ్లు నిండాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కోట, జూలై 4: బడిఈడు కలిగిన పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శైలజ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విద్యావిధానం, బడిఈడు పిల్లలు తదితర అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లతో సమావేశం జరిగింది. బడి ప్రదేశ్, నేను బడికిపోతా, ప్రవేశం అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష జరిగింది. మండలంలోని 21 పంచాయతీల్లో బడిఈడు పిల్లలపై సర్వే నిర్వహించి, విధిగా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 4: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రోగులకు ఎల్‌ఐసీ 74వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ నాగులు, ఉద్యోగులు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

నాయుడుపేట, జూలై 4: నూతనంగా నియమితులైన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి గురువారం కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ


ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

వాకాడు, జూలై 4: తెలుగుదేశం ఎమ్మెల్యేగా పాశం సునీల్‌కుమార్ ఘన విజయం సాధించడంతో వాకాడు మండలంలో టీడీపీ శ్రేణులు గురువారం సాయంత్రం నానాజీతో కలసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కోట క్రాస్ రోడ్డు నుంచి వందల సంఖ్యలో బైక్‌లు, కార్లతో విజయోత్సవ ర్యాలీ రంగన్నగుంటకు చేరుకొని అక్కడ నుంచి వాకాడు అశోక్‌పిల్లర్‌కు చేరుకుంది. యువత బాణాసంచా కాలుస్తూ డీజేలతో కేరింతలు కొట్టారు. మొదటగా ఆర్టీసీ డిపోకు చేరుకొని విజయవాడకు వెళ్లే రెండు కొత్త ఎలక్ట్రికల్ బస్సులను ఎమ్మెల్యే పాశం ప్రారంభించారు. రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఆయనను సన్మానించారు. ఫారెస్టు అధికారులు చేపల మార్కెట్ స్థలంలో ఎమ్మెల్యేతో మొక్కలు నాటించారు. వాకాడు అశోక్‌పిల్లర్ సమీపంలో అభిమానులు క్రేన్ ద్వారా ఏర్పాటు చేసిన గజమాలతో సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకాడు బజారుమీదుగా బీసీ కాలనీకి చేరుకొని, గొల్లపాళెం వరకు రోడ్‌షో కొనసాగింది. ఈ ర్యాలీలో నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఉచ్చూరు ప్రసాద్ రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు జనార్ధన్‌రెడ్డి, బత్తిన ప్రమీల, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, కోట శ్రీనివాసులు, తీపలపూడి రమణయ్య, పసుపులేటి రాజయ్య, దోశకాయల కృష్ణమూర్తి, షేక్ గౌస్‌మొహిద్దీన్, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరలో ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్ ల్యాబ్ ఏర్పాటు


ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ వంకి పెంచలయ్య

గూడూరు అర్బన్, జూలై 4: గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రప్రభుత్వ సహాయంతో ఏసీఐసీ ద్వారా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య తెలిపారు. ఇండస్ట్రీస్ 4.0 టెక్నాలజీస్ ద్వారా రోబోటిక్స్, త్రీడీప్రింటింగ్, ఎలక్ట్రిక్ వెహికల్స్ తదితర రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచి వారు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ల్యాబ్ ఏర్పాటుకు ఒక మిలియన్ రూపాయలను టీకేబోట్ సంస్థ సమకూర్చనుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మురుగదాస్, టీకేబోట్ సంస్థ సీఈవో డాక్టర్ వెంకటరెడ్డి, ఏసీఐసీ సీఈవో డాక్టర్ ఇమ్మానియేల్, ప్రొఫెసర్లు డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ ధనుంజయ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి, జే రామయ్య తదితరులు పాల్గొన్నారు.


కూలర్ వితరణ



కోట, జూలై 4: కోట మండల పరిషత్ కార్యాలయానికి గురువారం అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎన్.దేవకి కూలర్‌ను వితరణగా ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయానికి పలు సమస్యలపై వచ్చే ప్రజలు, సిబ్బందికి చల్లని మినరల్ వాటర్‌ను అందించాలన్న లక్ష్యంతో ఆమె ఈ కూలర్‌ను అందచేశారు. దేవకిని మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

తిరుచానూరులో పట్టపగలే దొంగలు పడ్డారు

- కాంట్రాక్టు ఉద్యోగి ఇంట్లో చోరీ
- 18 సవర్ల బంగారు నగలు, అర కిలో వెండి వస్తువులు, రూ.2.50లక్షల అపహరణ


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్నవస్తువులు

తిరుచానూరు, జూలై 4: తిరుచానూరులో పట్టపగలే దొంగలు పడ్డారు. పంచాయతీలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి మునేంద్ర ఇంట్లో 18 సవర్ల బంగారు నగలు, అరకిలో వెండి వస్తువులు, రూ.2.50 లక్షలు, చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. తిరుచానూరు కాలవగడ్డ వీధిలో మునేంద్ర కుటుంబం నివాసం ఉంటోంది. గురువారం మధ్యాహ్నం విధుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి, తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపు గడియ విరగ్గొట్టి లోపలకి వెళ్లారు. బీరువాలోని 18 సవర్ల బంగారు నగలు, అర కిలో వెండి వస్తువులు, రూ.2.50లక్షలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు పొలం వద్ద నుంచి మునేంద్ర తల్లిదండ్రులు ఇంటికి రాగా తలుపులు తెరచి ఉన్నాయి. లోపల వస్తువులన్నీ చిందరవందగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీం సిబ్బంది వచ్చి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తిరుచానూరు పరిసరాల్లో రాత్రి గస్తీ సరిగా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామం నడిబొడ్డులోనే పట్టపగలు దొంగలు పడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని అంటున్నారు.

శాఖాపరమైన విచారణ వేగిరపరచండి

- రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల వేడుకోలు


మీడియాతో మాట్లాడుతున్న జయచంద్ర

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 4: ఉత్త పుణ్యానికి శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల కేసులను త్వరగా పరిష్కరించి ఆదుకోవాలని విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.జయచంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఏసీబీ, ప్రభుత్వ ఆస్తులు, ధనాన్ని కాజేసిన కేసుల విషయంలో తాము సహాయాన్ని అర్థించడం లేదన్నారు. కానీ రెవెన్యూ శాఖలో చాలామంది ఉద్యోగులు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండానే క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటివారు రిటైర్ అయ్యాక ఆర్థికంగా, కుటుంబపరంగా చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కేసుల్లో విచారణాధికారులు త్వరగా విచారణ పూర్తిచేయక పోవడంతో పెన్షన్, ఇతర ప్రయోజనాలు అందక వారి జీవనం అస్తవ్యస్తం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే మతిచలించి తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికారులు అత్యంత నిర్దయగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొందరు అధికారులైతే భరించలేని భాషను వాడుతూ.. అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలపై విచారణ ఎదుర్కొంటున్నవారు జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారి కేసులను సత్వరం విచారించి.. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని విన్నవించారు. ఇప్పటికే అధికారుల చుట్టూ తిరిగి, ప్రెస్‌మీట్లు పెట్టి వయోభారంతో అలసిపోయానని, ఇదే తన చివరి ప్రెస్‌మీట్ అని గద్గద స్వరంతో అన్నారు. సమావేశంలో విశ్రాంత ఉప తహసీల్దార్ పీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

170 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఓ స్మగ్లర్ అరెస్టు, రెండు కార్ల సీజ్



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలతో ఫ్లయింగ్ స్క్వాడ్, పుత్తూరు అటవీశాఖ సిబ్బంది

పుత్తూరు అర్బన్/కేవీబీపురం, జూలై 4: రెండు సంఘటనల్లో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్, పుత్తూరు అటవీశాఖ అధికారులు గురువారం 170 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి, రెండు కార్లను సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్‌కు అందిన రహస్య సమాచారంతో సిబ్బంది పుత్తూరు మండలం గొల్లపల్లె మామిడి తోపు వద్ద తనిఖీలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో అటువైపు వస్తున్న ఓ కారును ఆపేందుకు ప్రయత్నించారు. ఆగకుండా వెళ్లిపోవడంతో ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది వెంబడించారు. కొద్ది దూరం వెళ్లాక నిందితులు వాహనాన్ని వదిలి మామిడితోటలోకి పారిపోయారు. అధికారులు తనిఖీ చేయగా వాహనంలో ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. దాంతో వాహనాన్నీ, అందులోని 125 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యాలయానికి తరలించారు. ఈ దుంగల బరువు 947 కిలోలు ఉంటుందని డీఎఫ్‌వో శివకుమార్ తెలిపారు. అలాగేపుత్తూరు అటవీశాఖ అధికారులు కేవీబీపురం నుంచి పిచ్చాటూరు వెళ్లే రహదారిలో తనిఖీలు చేపట్టారు. ఓ కారు మారప్పరెడ్డికండ్రిగ వద్ద అనుమానాస్పదంగా ఉండగా అధికారులు చుట్టుముట్టారు. తనిఖీ చేయగా వాహనంలో 45 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. దాంతో దుంగలతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అందులోని ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. పట్టుబడ్డ దుంగల బరువు 327.9 కిలోలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రసాద్‌కుమార్, డ్రైవర్లు సాయి, కిరణ్, షణ్ముగం, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది మునస్వామి, వినీల్‌కుమార్, పుత్తూరు అటవీశాఖ సిబ్బంది చైతన్య, సురేష్‌కుమార్, నీలకంఠం, వాసు, గోపి, రఘు, సింహాద్రి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జూలై 4: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయక పూజల కలశ పూజ, వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. హారతులు ఇచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, జూలై 4: స్థానిక భరద్వాజ తీర్థంలోని నరసింహ స్వామి సన్నిధి వద్ద గురువారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. శివగణం భక్త బృందం ఆధ్వర్యంలో అన్నపూర్ణ మాత ఆరాధన ఉత్సవం సందర్భంగా నరసింహస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. వినాయకస్వామి, నాగదేవతలకుకూడా పూజలు నిర్వహించారు. డాక్టర్ చాముండేశ్వరరావు ప్రవచనం చెప్పారు. సిద్ధులయ్య, రామలింగస్వామి, రాజకుమార్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎరువుల ఖర్చు ఆదా



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భాస్కరయ్య

ఏర్పేడు, జూలై 4: భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గించవచ్చని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య చెప్పారు. ఎండీపుత్తూరులో ఆత్మ సహకారంతో గురువారం భూసార పరీక్షలపై ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. పరీక్షల ద్వారా నేల పరిస్థితి, పోషకాల అందుబాటు, లోపాల గురించి తెలుస్తుందన్నారు. ఫలితాలను బట్టి లోపాలు సరిదిద్దితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. జింకు, నానో డీఏపీ ఎరువులు పంటపై స్ప్రే చేస్తే మంచిదన్నారు. ఏవో వేణుగోపాలరావు వరిసాగులో మెళకువలను వివరించారు. ఇఫ్కో క్షేత్ర అధికారి మణిచంద్ర, సర్పంచ్ మోహనప్రియ, భారతి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల ఆట స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాఠశాల కమిటీ చైర్మన్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 4: నెలవాయి ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని కొందరు ఆక్రమించారని పాఠశాల కమిటీ చైర్మన్ ధనంజయలు డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 1976లో వుగ్గురు దాతలు 6.43సెంట్ల భూమిని పాఠశాల కోసం ఇచ్చారన్నారు. 1.70సెంట్లలో భవనాలు నిర్మించి మిగతా స్థలం క్రీడా మైదానంగా వదిలి పెడితే గ్రామంలో కొందరు ఆక్రమించారన్నారు. ఆక్రమణను అడ్డుకుంటామని డిప్యూటి తహసీల్దార్ హామీ ఇచ్చారు.

కేజీబీవీ పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ



కేవీబీపురం, జూలై 4: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు మంజు తదితరులు, నాయకులు గోపీనాథ్‌రెడ్డి, సర్పంచ్ బాలాజీ, మణి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో సామాజిక తనిఖీ బహిరంగ సభ

వరదయ్యపాళెం, జూలై 4: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఈ నెల 6,7 తేదీలలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గత నెల 19 నుంచి ఈనెల 4వ తేదీ వరకు తనిఖీలు జరిపి గ్రామసభలు నిర్వహించామన్నారు. సామాజిక తనిఖీ బహిరంగ సభలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి వేతనదారులు, ఉపాధి సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నష్ట పరిహారంతో పాటు భూములు ఇప్పించండి

వరదయ్యపాళెం, జూలై 4: బత్తలవల్లంలోని కల్కి ఆశ్రమం నుంచి రూ.60లక్షల పరిహారంతో పాటు తమ భూములు ఇప్పించాలని గ్రామ దళిత రైతులు డిమాండ్ చేశారు. వారు గురువారం మాట్లాడుతూ సుమారు 20 ఏళ్ల క్రితం 3.70ఎకరాలను కల్కి ఆశ్రమం ఆక్రమించుకుందన్నారు. రూ.500 కోట్లతో ఆశ్రమం నిర్మించారన్నారు. కల్కి నిర్వాహకుల పిటీషన్‌ను హైకోర్టు కొట్టేసినా ఇప్పటి వరకు అధికారులు తమకు న్యాయం చేయలేదన్నారు. ఆశ్రమ నిర్వాహకులతో కుమ్మక్కై తమ భూములను వారికి ధారాదత్తం చేసేందుకు కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. రైతులు మునిచంద్రశేఖర్, రాజయ్య, పులి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాక్‌వర్త్ పరిశ్రమ ఔదార్యం



రాక్‌వర్త్ ఎండీ నుంచి ఫీజు చెల్లింపు రశీదు అందుకుంటున్న కార్మికురాలు

శ్రీసిటీ, జూలై 4: 12 మంది కార్మికుల పిల్లలకు అవసరమైన ఫీజులు చెల్లించి, విద్యా భరోసాను కల్పిస్తూ శ్రీసిటీలోని రాక్‌వర్త్ పరిశ్రమ ఔదార్యాన్ని చాటుకుంది. పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్ట్ పేరిట మూడేళ్లుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పరిశ్రమలో దిగువ స్థాయి ఉద్యోగులకు, వారి సీనియారిటీ, ఉటుంబ ఆర్థి స్థితి ఆధారంగా ఎంపిక చేసి చదువులకు చేయూతనిస్తున్నారు. ఈ ఏడాది 12 మంది విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా రూ. 9 లక్షల ఫీజులు చెల్లించారు. కంపెనీ చొరవను శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్



శ్రీకాళహస్తి, జూలై 4: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్ వెంకటేశ్వర్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. తీర్థప్రసాదాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసులు, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



రంగా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, జూలై 4: వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి సమీపంలోని ఆయన విగ్రహానికి శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో గురువారం నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో రంగా విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. గరికపాటి చంద్రశేఖర్, ఉప్పు కృష్ణయ్య, గాజుల సత్యనారాయణ, పూల కృష్ణయ్య, స్వర్ణమూర్తి, అంజూరు వెంకటేష్, పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కొత్తపేటలో గల కార్గిల్‌సెంటర్ వద్ద గురువారం రాధా రంగమిత్ర మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. సిద్ధులగారి మురళి, ప్రసాద్, కోలా వెంకటేశ్వరరావు, నరసయ్య, పగడాల సుధాకర్, వెంకటప్రసాద్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాడ వీధుల్లో ఫ్లెక్సీల నిషేధం

శ్రీకాళహస్తి, జూలై 4: శ్రీకాళహస్తీశ్వరాలయ మాడ వీధుల్లో ఫ్లెక్సీలను నిషేధిస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మాడవీధులతో పాటు సన్నిధివీధి, టూరిస్టు బస్టాండు వరకు ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.వెయ్యి జరిమానాతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

తీరు మార్చుకో జగన్ : టీడీపీ

శ్రీకాళహస్తి, జూలై 4: ముఖ్యమంత్రి చంద్రబాబును గౌరవంగా సంబోధించాలని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ నెల్లూరు సెంట్రల్‌జైల్ బయట చంద్రబాబును ఏకవచనంతో సంబోధించడం పద్ధతి కాదని, తీరు మార్చుకోవాలని హితవు ఇబ్బంది పెట్టారో గుర్తుకు తెచ్చుకోవాన్నారు. ఇప్పుడు ఆయన రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని ఏకవచనంతో సంబోధిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వరచౌదరి, దారా పాండు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్,ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం



సత్యవేడు, జూలై 4: కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజును కూడా ఆదిమూలం గురువారం సాయంత్రం కలిసి సన్మానించారు. శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశ్రామికవాడలో కార్డన్ సెర్చ్

రేణిగుంట, జూలై 4: గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పారిశ్రామికవాడలో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన 45మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఒడిషా, బీహార్, పశ్చిమబెంగాల్ చెందిన వ్యక్తులుగా గుర్తించి విడిచిపెట్టారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మరో నలుగురి వద్ద గుర్తింపు, ఆధార్‌కార్డులు లేకపోవడంతో బంగ్లా దేశీయులుగా అనుమానిస్తున్నారని సమాచారం. పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

నీట్ రద్దు కోరుతూ విద్యార్థి సంఘాల ఆందోళన



శ్రీకాళహస్తిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

శ్రీకాళహస్తి, జూలై 4: నీట్ రద్దు చేయాలని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపుతో శ్రీకాళహస్తిలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ప్రభుత్వ విద్యాసంస్థలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జాకీర్, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి చందు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. జూనియర్ కళాశాల నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. రిజ్వాన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు : సత్యవేడులో కొన్నియాజమాన్యాలు పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేయగా, విద్యార్థి సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కూడా బంద్ పాటించాయి. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మురళి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నవీన్‌కుమార్, ఎస్ఎఫ్ఐ వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మహేష్, సాయికుమార్, సంతోష్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆగ్రహం

●రేణిగుంట గ్రామసభలో అధికారుల నిలదీత



గ్రామసభలో సర్పంచ్, ఈవోలను ప్రశ్నిస్తున్న మహిళలు

రేణిగుంట, జూలై 4: మంచినీటి సమస్య పరిష్కరించాలని మహిళలు గ్రామసభలో పంచాయతీ ఈవో, సర్పంచ్‌ను చుట్టుముట్టిన వైనమిది. వివరాలివి.. 15రోజులుగా జీఎం వీధి, పాంచాలినగర్, గౌరీనగర్, బిస్మిల్లా నగర్, వివేకానంద, భగత్‌సింగ్ కాలనీలకు నీటి సరఫరా కావడంలేదు. దీంతో ఆయా ప్రాంతాల మహిళలు, కమ్యూనిస్ట్ నాయకులతో కలిసి గురువారం పంచాయతీలో గ్రామసభకు వచ్చారు. పంచాయతీ అధికారి, సర్పంచ్‌లను నిలదీశారు. సర్పంచ్ నాగేశం, ఈవో బాలసుబ్రహ్మణ్యంరెడ్డి స్పందిస్తూ మంగళం వద్ద తెలుగుగంగ పైపులైన్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయన్నారు. రెండురోజుల్లో నీటి సరఫరాకు ప్రయత్నిస్తామన్నారు. లేనిపక్షంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు శాంతించారు. కాగా సాయంత్రం వివేకానంద కాలనీ, భగత్‌సింగ్ కాలనీ బిస్మిల్లా నగర్, వినాయకనగర్ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



పాపానాయుడుపేట కళాశాలలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, జూలై 4: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మమాలిని, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ నంద్యాల వెంకటసుబ్బమ్మ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సత్యవేడు: సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి డిప్యూటి తహసీల్దార్ రవిచంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అన్నప్రసాదంలో నాణ్యత ముఖ్యం



భక్తులను అడిగి భోజన నాణ్యతను తెలుసుకుంటున్న బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 4: ముక్కంటి ఆలయ అన్నప్రసాదంలో నాణ్యతా ప్రమాణాలు కొరవడటం తగదని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి అన్నారు. ఆలయంలోని అన్నదాన కేంద్రాన్ని గురువారం వారు తనిఖీ చేశారు. భక్తులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భక్తులు వారికి తమ సమస్యలను వివరించారు. పరిశుభ్రత ముఖ్యమని, అన్నప్రసాదంలో నాణ్యతను పాటించాలని అక్కడి సిబ్బందికి చెప్పారు. భక్తులకు అడిగినంత వడ్డించాలన్నారు. టీడీపీ నాయకులు మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల10 నుంచి ఎస్వీయూ పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 4: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల పదో తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ దాకా కొనసాగుతాయి. యూనివర్సిటీ పరిధిలోని 14 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు సుమారు 3వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు అంచనా. అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.32 కోట్లు

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.32 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 69,632 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,179 మంది తలనీలాలు సమర్పించారు.

సీడ్స్ బత్తెయ్యకు సతీవియోగం



పద్మమ్మ(పాతచిత్రం)

ఏర్పేడు, జూలై 4: సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పైపూరి బత్తెయ్య సతీమణి పద్మమ్మ(55) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె 15 సంవత్సరాలుగా సంఘమిత్రగా, మహిళా లీడర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. బత్తెయ్య 30 ఏళ్లుగా దళితుల సమస్యలపై పోరాటం చేస్తున్నారు.

జిల్లా జీవ శాస్త్ర ఫోరం అధ్యక్షుడిగా కామాక్షయ్య



పిచ్చాటూరు, జూలై 4: రాజానగరం జడ్పీ హైస్కూలు ఉపాధ్యాయుడు కామాక్షయ్య జిల్లా జీవశాస్త్రం ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్‌లో నీలకంఠయ్య ఆధ్వర్యంలో గురువారం ఫోరం ఎన్నిక జరిగింది. కార్యవర్గం కూడా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వసుంధర, ట్రెజరర్‌గా హరిశంకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఓం.ప్రకాష్, రాజశేఖర్‌రెడ్డి, గుర్రప్ప, పాల్గొన్నారు.

జీవో నెం.117 రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, జూలై 4: జీవో నెంబరు.17 రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కె.రమేష్ డిమాండ్ చేశారు. పెద్దకనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యాభివృద్ధికి విఘాతంగా మారిన జీవో నెంబరు 117ను వెంటనే రద్దు చేసి పాఠశాలలను కాపాడాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఎస్టీయూ నాయకులు గుమ్మడి మురళి, దేవేంద్ర, కృష్ణయ్య, సుధాకర్‌యాదవ్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును గురువారం ఏర్పేడు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తాళ్లపాక సుధాకర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు చెప్పారు. -ఏర్పేడు

పుత్తూరు వార్తలు

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పుత్తూరు అర్బన్, జూలై 4: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వేపగుంట క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించామన్నారు. వీటిని సీజ్ చేయడంతో పాటు ఆరు టన్నుల ఇసుకను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ట్రాక్టర్లను పుత్తూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సేంద్రియ ఎరువులతో చీడల నివారణ

నారాయణవనం, జూలై 4: సేంద్రియ ఎరువులతో పంటలపై చీడలను నివారించుకోవచ్చని వ్యవసాయశాఖ జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. గురువారం కొండల చెరువులో ఆత్మ సహకారంతో రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగం, సాగులో వైవిధ్యం ద్వారా చీడల నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి సాగులో ఖర్చు తగ్గి, నాణ్యత పెరుగుతుందన్నారు. ఏవో వేణుగోపాల్‌రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు విష్ణుప్రియ, మురళీయాదవ్, సుభాషిని, మోహన్ రమ్య, దివ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భూపతి, అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

సీఆర్వోకి శ్రీవాణి కౌంటర్లు

● ట్రస్టుకు విరాళాలిచ్చే భక్తులకు పెరగనున్న ఇబ్బందులు



తిరుమల ఈవో కార్యాలయంలోని శ్రీవాణి ట్రస్టు కౌంటర్

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రస్తుతం ఈవో కార్యాలయంలో ఉన్న శ్రీవాణి టికెట్ల కౌంటర్లను సీఆర్వోకు తరలించాలనే నిర్ణయం వల్ల భక్తులకు ఇబ్బందులు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ కౌంటర్లలో రూ.10,500లు చెల్లించిన వారికి మరుసటి రోజుకు వీఐపీ బ్రేక్‌లో దర్శనం కేటాయిస్తున్నారు. తొలుత ఈ కౌంటర్‌ను తిరుమలలోని ఈవో కార్యాలయంలోనే ఏర్పాటు చేశారు. రద్దీ అధికంగా ఉందని ఆ తర్వాత తిరుపతికి మార్చారు. అక్కడ కూడా భక్తుల క్యూలైన్లు పెరిగిపోవడం, ట్రాఫిక్, ఆటోడ్రైవర్లు శ్రీవాణి టికెట్లతో అక్రమాలకు పాల్పడుతున్నారనే కారణాలతో తిరిగి తిరుమలకు మార్చారు. గోకులం విశ్రాంతి భవనంలోని ఈవో కార్యాలయంలో రెండు కౌంటర్లు నడిచేవి. ఎన్నికల సమయంలో అదనంగా రెండు కౌంటర్లు ప్రారంభించారు. ప్రస్తుతం మొత్తం నాలుగు కౌంటర్ల ద్వారా రోజుకు దాదాపు వెయ్యి మందికి శ్రీవాణి టికెట్లు కేటాయిస్తున్నారు. ఇదే కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, రాజ్యాంగ హోదా కలిగిన ప్రముఖులకు కూడా సిఫార్సు లేఖలు తీసుకుని వీఐపీ బ్రేక్ టికెట్లను కేటాయిస్తుంటారు. ఈక్రమంలో కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది తమకు శ్రీవాణి ట్రస్టు కౌంటర్లు ఇబ్బందిగా మారాయని, అలాగే వెనుకభాగంలోని ఈవో సమావేశానికి కూడా సమస్యగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో సీఆర్వోకు మార్చాలని నిర్ణయించిట్లు తెలిసింది. అత్యంత రద్దీగా ఉండే సీఆర్వోకు ఈకౌంటర్లు మార్చిడి చేస్తే శ్రీవాణిట్రస్టు దాతలకు ఇబ్బందులు అధికమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సీఆర్వోలో లక్కీడిప్ ఆర్జితసేవల కోసం, నూతన వధూవరుల కల్యాణోత్సవం దర్శనాల కేటాయింపులు, సిఫారసు గదుల కేటాయింపు, సాధారణ గదుల కేటాయింపు వంటివి జరుగుతున్నాయి. సీఆర్వో నిత్యం కిటకిటలాడుతూ ఉంటుంది. శ్రీవాణి కౌంటర్లు కూడా ఇక్కడే సర్దితే భక్తులకు అవస్థలు తప్పవు. ఎంబీసీకి ఈ కౌంటర్లు మార్చినా ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. ఎంబీసీలో సిఫార్సులపై ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు మధ్యాహ్నం తర్వాత కేటాయిస్తారు. మధ్యాహ్నం వరకు కౌంటర్లు ఖాళీగానే ఉంటాయి కాబట్టి వీటిని వినియోగించుకోవచ్చు.